క్లుప్తంగా

అందరికీ వైద్యం.. ప్రభుత్వ లక్ష్యం


వైద్యసిబ్బందితో కలిసి సర్వేలో పాల్గొన్న సర్పంచ్ మోహనప్రియ

ఏర్పేడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రభుత్వం అందరికీ వైద్యం అందిస్తున్నట్లు సర్పంచ్ మోహనప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని ఎండీపుత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికే జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను వైద్యసిబ్బంది సేకరిస్తున్నట్లు చెప్పారు. త్వరలో పంచాయతీ పరిధిలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యసేవలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దివ్య, ఏఎన్‌ఎం లలిత, ఆశ కార్యకర్త సునీత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


వరదయ్యపాళెంలో నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

వరదయ్యపాళెం: డాక్టర్ అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా ఆదివారం వరదయ్యపాళెంలో బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రెడ్‌క్రాస్ సహకారంతో స్థానిక గ్రామ సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 45 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి అబ్దుల్ కలామ్ సేవలకు సంఘీభావం తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు రియాజ్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మైనారిటీ సెల్ నాయకులు నవాబు, ఉపసర్పంచ్ మహేంద్ర, సీఐటీయూ కన్వీనర్ బాషా, సంస్థ సభ్యులు అబ్దుల్ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు


ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

పిచ్చాటూరు: దసరా పండుగను పురస్కరించుకుని కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో జూదం, కోడి పందేలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం ఎవరైనా చేస్తే మొబైల్ నంబర్ 9440900727కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

డీసీసీబీలో అధిక వడ్డీ సదుపాయం


శరవణకుమార్

పిచ్చాటూరు: ధరణి డిపాజిట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ బ్యాంక్ పిచ్చాటూరు బ్రాంచ్ మేనేజర్ ఎం.శరవణకుమార్ కోరారు. ఆదివారం స్థానిక డీసీసీ బ్యాంకులో మేనేజర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా సీనియర్ సిటిజన్‌కు 8.5 శాతం అధికవడ్డీ వర్తిస్తుందన్నారు. కనిష్ట డిపాజిట్ రూ.1000 పైబడి స్వీకరిస్తామన్నారు. ఈ పథకం ద్వారా ఇతర బ్యాంకుల కంటే అధిక వడ్డీ పొందవచ్చన్నారు. డిపాజిట్‌కు డీసీజీసీ ఇన్సూరెన్స్ ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 9949826944 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పేద మహిళకు చేయూత


మహిళకు కుట్టుమిషన్ అందజేస్తున్న ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండలంలోని పద్మావతీపురానికి చెందిన పేద మహిళ ఎస్. కుమారి, వృద్ధాప్యంలో అనారోగ్యం బారినపడిన తన తల్లిని పోషిస్తూ కుటుంబ పోషణ భారమైన ఆమెకు ఉపాధి కల్పించే దిశగా డైనమిక్ ఫౌండేషన్ సంస్థ చేయూతనిచ్చింది. ఆ మేరకు ఆదివారం సంస్థ సభ్యులు కుట్టుమిషన్‌ను వితరణగా అందజేసి కొంతమేరకు ఆర్థికసాయాన్ని అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు బొప్పన శ్రీనివాసులు తెలిపారు. డైనమిక్ సంస్థ ప్రతినిధులు మునిసుబ్రమణ్యం, నాగప్రసాద్, బాలకృష్ణ, ప్రభాకర్, మహ్మద్, డేవిడ్, చిల్డ్రన్స్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు..

శ్రీకాళహస్తి: పట్టణంలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. 14వ వార్డు పరిధిలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని తెలిపారు.

జగజ్జననీ.. నమో నమామి..





నాగలాపురంలో: రాజరాజేశ్వరి అలంకరణలో, వరదయ్యపాళెంలో.. బాలాత్రిపుర సుందరిగా కామాక్షాంభిక, బాలాత్రిపుర సుందరిగా మూలస్థాన ఎల్లమ్మ

ఏర్పేడు: మండలవ్యాప్తంగా ఆదివారం శరన్నవ రాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మండలంలోని ఎండీపుత్తూరు యల్లమ్మ దేవి శైలపుత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుడిమల్లం ఆనందవల్లీ దేవి, చిందేపల్లిలో పార్వతీసమేత సిద్ధేశ్వర స్వామి, కోబాక పోలినాంచారమ్మ, పాపానాయుడుపేట భ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి, అంజిమేడు గంగమ్మ, ఏర్పేడు నాగాలమ్మ, పాతవీరాపురం చెంగాళమ్మ, మూలకంద్రిగ ఓసూరమ్మ ఆలయాల్లో అమ్మవారికి విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం జరిగింది.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలత్రిపురదేవి అవతారంలో అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో హోమపూజలు చేశారు. ఉభయదారులుగా గవాస్కర్ దంపతులు వ్యవహరించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా తొలిరోజు ఆదివారం మండలంలోని వివిధ ఆలయాలలో అమ్మవార్లు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ అనుబంధ సముదాయంలోని అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. కైలాసనాథకోనలోని కామాక్షాంభిక సమేత కైలాసనాథ ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి కుంకుమార్చనలు చేశారు. తిరువట్యంలోని మూలస్థాన ఎమ్మమ్మ బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. స్థానిక ధర్మరాజుల ఆలయంలో ద్రౌపతీ దేవి బాలత్రిపుర సుందిగా అలంకరించుకుని ఊంజల్‌సేవలో భక్తులకు దర్శనమిచ్చారు.

నాగలాపురంలో..

నాగలాపురం: శ్రీ సర్వమంగళ సమేత పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలోశ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సురుటుపల్లిలో..

నాగలాపురం: సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆదివారం శ్రీ మరకదాంబిక అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో, 16న కామాక్షి, 17న మీనాక్షి, 18న అన్నపూర్ణ, 19న మహాలక్ష్మి, 20న దుర్గాదేవి, 21న శివలింగపూజ, 22న శయన మూర్తి, 23న జ్ఞాన సరస్వతి, 24న మహిషాసుర మర్థిని అలంకరణలో దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.




పాతవీరాపురంలో విశేష అలంకరణలో చెంగాళమ్మ, చిందేపల్లిలో విశేష అలంకరణలో పార్వతీ దేవి, ఎండీపుత్తూరులో శైలజపుత్రి దేవిగా యల్లమ్మ దేవి

శ్రీకాళహస్తిలో శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా కలశ ప్రతిష్ట జరిగింది. దీంతో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో కలశాన్ని ప్రతిష్టించారు. విశేష పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, ఓంశక్తి నామస్మరణలతో కలశం చేతపట్టి వేద పండితులు ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు అష్టబంధన పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు పలు రకాల సుగంధ ద్రవ్యాలు చందనం, పసుపు, పంచామృత, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు కనకాచలంపై దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బుల్లెట్ జయశ్యామ్, కొండూరు సునీత, లక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణిపాండు, అభిషేక ఉభయకర్త కాసరం బాలాజీ, ఆలయ అధికారులు లోకేష్‌రెడ్డి, దుర్గాప్రసాద్, అర్చకులు దక్షిణామూర్తి, తులసీశర్మ, గోవింద్‌శర్మ, వేదపండితులు పాల్గొన్నారు.


కలశాన్ని తీసుకువస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

గయాజ్‌కు పరామర్శ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గయాజ్ గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ఆదివారం గయాజ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట స్థానిక నేతలు ఉన్నారు.


గయాజ్‌ను పరామర్శిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

పీసీసీ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: కాంగ్రెస్ పార్టీ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బత్తెయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కారణమైన పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


బత్తెయ్యనాయుడును సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

అగ్నిగుండ మహోత్సవం


బియ్యపు పవిత్రా రెడ్డికి స్వాగతం పలుకుతున్న శివనాథపాళెం గ్రామస్తులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని శివనాథపాళెం గ్రామంలో ఆదివారం రాత్రి శ్రీరుక్మిణీదేవి సమేత పాండురంగ స్వామి అగ్నిగుండ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తజనంతో కలిసి సరదాగా కాసేపు కోలాటం ఆడారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ్నాయుడు, సర్పంచ్ రాజ్‌ప్రకాష్, నరేష్, గిరి, దామోదరం, రమణయ్య, సిసింద్రీ, బాలయ్య, వెంకీ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి


మాట్లాడుతున్న ఎస్‌ఐ ఓబయ్య

నాగలాపురం: గ్రామంలోని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు. ఆదివారం ఆయన మండలంలోని వినోభా నగర్ గ్రామస్తులతో మాట్లాడారు. ఆలయాలను పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

'ధరణి'ని సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శ్రీకాళహస్తి శాఖలో ఖాతాదారులు ధరణి డిపాజిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేనేజరు సాయి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు చేసిన డిపాజిట్లకు 450 రోజులకు అత్యధికంగా 8శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు 8.5శాతం వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9949826942 నంబరులో సంప్రదించాలని కోరారు.

గోవిందయ్యకు పద్మశ్రీ బోయి భీమన్న పురస్కారం


గొడుగుచింత గోవిందయ్యను సన్మానిస్తున్న అతిథులు

శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా భాకరాపేటలో ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్జున్ ఫంక్షన్ హాలులో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొడగుచింత గోవిందయ్యకు పద్మశ్రీ డాక్టర్‌బోయి భీమన్న పురస్కారం లభించింది. ఈయనను సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు.

మాణిక్యంకు...

నారాయణవనం: మండలంలోని బ్రాహ్మణతాంగాళ్‌కు చెందిన మాణిక్యంకు ఉత్తమ కవితా విభాగంలో బోయి భీమన్న స్మారక పురస్కారం లభించింది. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో తన కవితలకు పలువురి ప్రశంసలు లభించాయని అన్నారు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన

శ్రీకాళహస్తి: ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రజాప్రగతి ట్రస్టు శ్రీకాళహస్తి డివిజన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోకపోవడంతో ప్రపంచ వ్యాప్తంగా 40శాతం మంది వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రగతి ట్రస్టు సిబ్బంది

శైలపుత్రీ.. నమోస్తుతే..

శ్రీకాళహస్తి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో వేదపండితులు శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కనకదుర్గమ్మ శైలపుత్రిగా, బొమ్మల కొలువులో ఏర్పాటు చేసిన జ్ఞానప్రసూనాంబ శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు. పానగల్ గంగమ్మ శైలపుత్రిగా, బజారువీధిలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు తిరుక్కడయార్ అభిరామి సమేత అమృత ఘటేశ్వరస్వామి అలంకరణలో, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు, ముత్యాలమ్మ అమ్మవారు బాలత్రిపుర సుందరి అలంకరణలో భక్తలను అనుగ్రహించారు.




బాలా త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ, ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు, శైలపుత్రిగా ఏడుగంగమ్మల అమ్మవారు


బాలాత్రిపుర సుందరిగా భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు


స్వర్ణకవచాలంకరణలో శ్రీకాళహస్తీశ్వరాలయంలోని కనకదుర్గమ్మ


బొమ్మల కొలువులో శైలపుత్రిగా జ్ఞానప్రసూనాంబ దేవి

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

రేణిగుంట: రేణిగుంటలోని యోహా లూథరన్ చర్చిలో ఆదివారం కృతజ్ఞతార్పణల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి హాజరయ్యారు. క్రైస్తవ మతపెద్దలతో కలసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేశం, జువ్వల దయాకర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు రసూల్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు రఫీవుల్లా, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

పానగల్ గంగమ్మకు పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని పానగల్‌రోడ్డులో వెలసిన గంగమ్మ అమ్మవారిని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకు గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్కాటు ముత్తు, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, దాము, కంఠా ఉదయ్‌కుమార్, గిరిప్రసాద్‌గౌడ్, కార్తీక్, లోకేష్, శ్రీరాముల గౌడ్, డిల్లీబాబు, బాలా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గంగమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న అంజూరు తారక శ్రీనివాసులు

సాయం అందించండి

శ్రీకాళహస్తి: రెండు రోజుల క్రితం చిత్తూరు సమీపంలో శ్రీకాళహస్తి పట్టణం జెట్టిపాళెంకు చెందిన బి.కిరణ్‌కుమార్ జెట్టి కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతను ప్రస్తుతం ట్రూమా ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నాడు. ఒక రోజుకు రూ.50 వేల వరకు ఖర్చు అవుతోంది. దాతలు సాయం చేసి కిరణ్‌కుమార్‌ను రక్షించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సాయం చేసే దాతలు 8056180617 నంబరులో సంప్రదించాలని కోరారు.


కిరణ్‌కుమార్ జెట్టి

బస్ షెల్టర్‌ను నిర్మించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెరిణికండ్రిగ గ్రామంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో బస్సులు కోసం వచ్చే విద్యార్థులు, ప్రయాణికులు కేటీ రోడ్డు పక్కన నిలబడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నానా అవస్థలు పడుతున్నారు. బస్‌షెల్టర్ నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైన సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి బస్ షెల్టరును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


బస్సుకోసం ఎండలో వేచి ఉన్న విద్యార్థులు

ఆ నాటి స్నేహం.. ఈనాటికీ మధురం..


రేణిగుంట పీఎం హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట మండలం జీవాగ్రం సమీపంలో ఉన్న పీఎం హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. 1982–83 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఇన్నాళ్ల తరువాత ఆత్మీయ సదస్సు నిర్వహించారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఏకమైన వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగ క్షేమాలు తెలుసుకున్నారు. స్కూల్లో నాటి వారి అనుభూతులను నెమరు వేసుకున్నారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు అవిలాల వెంకటరామిరెడ్డి, స్కూల్ కరెస్పాండెంట్ ప్రసాద్, భూషణం, భాస్కర్, ప్రధానోపాధ్యాయురాలు జోస్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కరయ్య, చంద్రశేఖర్, కుప్పస్వామి, వరప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.